క్లుప్తంగా

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

తోట్లవల్లూరు: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హరి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం శుక్రవారం వేకువజామున 5.45 గంటలకు స్వామి వారు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఇస్తారని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

అలరించిన శ్రీనివాస కల్యాణ గానామృతం

జమీదగ్గుమిల్లి(పామర్రు): గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం గానామృతం గురువారం నిర్వహించారు. గుడివాడకు చెందిన భక్త బృందం సభ్యులచే ఈ గానామృతం చేశారు. శ్రీనివాసుని కల్యాణ ఘట్టాల పాటలు పాడుతూ ఎంతో మధురంగా కల్యాణం జరిపించారు. భక్తులు కాకర్ల సీతారామాంజనేయదాసు చంద్రావతి, కాకర్ల సాయిబాబు శివనాగమణి, కూనపరెడ్డి చంద్రశేఖర్‌రావు ధనలక్ష్మీ, కూనపరెడ్డి నాగమల్లేశ్వరరావు విజయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయంలో ధనుర్మాస పూజ లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం వచ్చిన భక్తులు అందరికీ అన్న ప్రసాదాన్ని సమర్పించారు.

12న మహిళలకు ముగ్గుల పోటీలు

కూచిపూడి(మొవ్వ): సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 12వ తేదీన కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠంలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొట్టిపాటి సాయి పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ. 5 వేలు, మూడో బహుమతిగా రూ.2500 నగదు అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే పోటీలో పాల్గొన్న మహిళలకు సైతం ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని చెప్పారు.

నేడే ఎస్టీయు జిల్లా 78వ వార్షికోత్సవ సమావేశం

మొవ్వ: కృష్ణా జిల్లాలోని మొవ్వ శ్రీ మండవ జానకిరామయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో శుక్రవారం ఎస్టీయూ కృష్ణా జిల్లా 78వ వార్షిక మధ్యంతర సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ యూనియన్ కృష్ణా జిల్లా ఆర్థిక కార్యదర్శి కొణతం మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డితోపాటు ఇతర రాష్ట్ర, జిల్లా నాయకులు, మండలాల బాధ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 390 అర్జీలు

ముదినేపల్లి రూరల్: ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మండల వ్యాప్తంగా 390 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జేఎస్ సుభాని గురువారం తెలిపారు. మండలంలో గత నెల 11న సదస్సులు ప్రారంభించగా బుధవారంతో ముగిసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 33 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో పలు సమస్యలపై రైతుల నుంచి 390 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వీటిని పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరిస్తామని చెప్పారు.

మినుములో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రాపర్ల(పామర్రు): మినుము సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సా ధించివచ్చునని మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి తెలిపారు. మండలపరిధి లోని జమీదగ్గుమిల్లి, రాపర్ల గ్రా మంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినుము సాగులో వచ్చే తెగుళ్లను నివారిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. మండల పరిధిలో 23,500 ఎకరాల్లో మినుము పంట సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం మినుము సాగు బాగానే ఉందన్నారు. మంచు వలన పంటకు కొంత లాభం చేకూరుతుందన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సంక్రాంతి సంబరాలు

కైకలూరు: సంక్రాంతి సంబరాలతో కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గురువారం సందడిగా మారింది. విద్యార్థులు, అధ్యాపకులు సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు. మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. భోగి మంటలు వేసి అందరూ ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.శ్రీలత మాట్లాడుతూ నేటి తరం పండుగల ఆవశ్యకత, సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాష్, అధ్యాపకులు ఎం.హరిప్రసాద్, వై.జ్ఞానప్రసూనాంబ, నున్న శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు

పామర్రు: సాయినగర్‌లో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో కాగడా హారతితో కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామికి విశేషంగా పంచామృతాలతో నవరసాలతో ఆవుపాలతో అభిషేకాలు నిర్వహించి శత సహస్ర నామాలతో పూజలు చేశారు. భక్తుల చేత స్వామికి పూజలను చేయించారు. మధ్యాహ్న హారతి నిర్వహించి అనంతరం వచ్చిన భక్తులు అందరికి స్వామి అన్న ప్రసాదాన్ని అందజేశారు.

చరిత్రకు చిహ్నంగా చెన్నకేశవాలయం

- నేడు వైకుంఠ ఏకాదశి
- భక్తులకు ఉత్తర ముఖ ద్వారాన దర్శనమివ్వనున్న స్వామివారు



స్వామివారి ఆలయం



చారిత్రాత్మక 120 అడుగుల ఎత్తయిన గాలి గోపురం

గుడ్లవల్లేరు: నేటి రాజమండ్రి అయిన ఆనాటి రాజమహేంద్రవరాన్ని పరిపాలించిన రాజరాజ నరేంద్రుడు క్రీస్తు శకం 1062 కాలంలో గుడ్లవల్లేరు మండలం కౌతవరానికి విచ్చేశారని ఇక్కడి చరిత్ర చెబుతుంది. రామేశ్వర పుణ్య తీర్థ యాత్రలకు బయలుదేరి ఈ గ్రామంలోనే శ్రీ గౌతమేశ్వర స్వామివారిని సేవించేందుకు ఇక్కడ ఆయన తన పరివారంతో మజిలీ చేశారు. అప్పట్లో ప్రథమ శ్రేణి శైవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన ఈ గ్రామంలో వైష్ణవాలయం లేని లోటును భర్తీ చేసేందుకు భూదేవి శ్రీదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామివారి ఆలయాన్ని నిర్మించేందుకు ఆ మహారాజు నిర్ణయించుకున్నారు. దక్షిణ ముఖుడై రామేశ్వరానికి ఆయన బయలుదేరిన కారణంగా చెన్నకేశవ స్వామివారిని దక్షిణ ముఖంగా ప్రతిష్ఠించినట్లుగా స్థానికులు చెబుతున్నారు. 1901–1903లో ఆలయ ప్రాకారాలతో పాటు 120 అడుగుల ఎత్తున్న ఇక్కడి రాజ గోపురాన్ని అప్పట్లో కానూరి లింగమూర్తి గ్రామస్తుల సహకారంతో సంయుక్తంగా నిర్మించారు.

శతాబ్దాల చరిత్రకు ఆనవాలంగా...

శతాబ్దాల చరిత్రకు ఆనవాలంగా కౌతవరంలో శ్రీ లక్ష్మీ, భూదేవి సమేత చెన్నకేశవ స్వామివారి ఆలయం నిలుస్తుంది. చరిత్రకు దర్పణంగా స్వామివారి ఆలయం నిలుస్తుంది. అలనాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా లేనంత ఎత్తులో 120 అడుగుల ఎత్తుతో ఆలయ ప్రాంగణంలో గాలి గోపురాన్ని నిర్మించారు. ఈ కట్టడం వందల ఏళ్లకు పూర్వమే నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. ఈ ఆలయ చరిత్ర గురించి అనేక విషయాలను తెలిపే శిలాఫలకాలను బ్రిటీష కాలంలోనే మద్రాసు పురావస్తు శాఖకు చేర్చారు. ప్రస్తుతం స్వామివారికి కేవలం 22 ఎకరాల పైగా భూములే ఉన్నాయని చెబుతున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైశాఖ పౌర్ణమినాడు స్వామివారికి ఏటా కల్యాణం జరుగుతుంది.

స్వామివారి కోసం పోటాపోటీగా జమిందార్లు...

పూర్వం స్వామివారికి చల్లపల్లి రాజా, నూజివీడు జమిందారు స్వామివారికి అంబారీ కట్టేందుకు ఏనుగును పంపే విషయంలో పోటీ పడేవారని అంటున్నారు. ఎవరి ఏనుగు ముందు వస్తే వారి ఏనుగుపై స్వామివారు ఊరేగేవారని గత వైభవాన్ని స్థానికులు తలచుకుంటున్నారు. ప్రస్తుతం స్వామివారికి నిత్య ధూప, దీప నైవేద్యాలను నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రతి ఏటా నిర్వహించే శాంతి కల్యాణం చేపడతారు. నేటి ఉత్తర ముఖ ద్వార దర్శనం ద్వారా స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

1062లోనే స్వామివారి ప్రతిష్ట



ఈ ఆలయంలో 1062లోనే రాజ రాజనరేంద్రుడి కోరిక మేరకు స్వామివారిని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత స్వామివారి అంబారీ విషయంలో పెద్ద పెద్ద జమిందారులే ఏనుగులను పంపించేవారు. అలాగే అర్చకులు కూడా తర తరాలకు చెందిన వారే స్వామివారికి పూజలు ఒనరించటం జరుగుతుంది.

– మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, సాగునీటి డీసీ చైర్మన్

ధనుర్మాస పూజల్లో తరిస్తున్న భక్తులు



స్వామివారి సన్నిధిలో భక్తులు ధనుర్మాస పూజల్లో తరిస్తున్నారు. నేడు ఉత్తర ముఖ ద్వార దర్శనం ద్వారా స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. నెల గంట పట్టిన నాటి నుంచి ఈ పూజలను ప్రారంభించటం జరుగుతుంది. ఆలయంలో ఒక రకంగా ఆధ్యాత్మిక పండుగ వాతావరణం నెలకొంది.

– వి.దుర్గాప్రసాద్, ఆలయ ఈఓ

మండవల్లిలో నగర సంకీర్తన



మండవల్లి: ధనుర్మాసం సందర్భంగా శ్రీదత్త పరంపర సహిత షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు వెళ్లి బిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, యిన్నా వెంకటేశ్వరరావు, బండారు వెంకయ్య, పెరుమాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి



పమిడిముక్కల: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మొవ్వ మోహనరావు డిమాండ్ చేశారు. కపిలేశ్వరపురం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పూలమాలేసి నివాళులర్పించారు. మోహనరావు మాట్లాడుతూ దేశంలో సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలు అదుపులో ఉండాలంటే మతతత్వ పార్టీ బీజేపీని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భుజంగనాయక్, మండల అధ్యక్షుడు కాగిత సోమేశ్వరరావు, పార్టీ నాయకులు పిట్టు శ్రీనివాసరావు, మద్దాలి నాగ భూషణం, లంకేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



పామర్రు మండలంలో భోగి మంటలు వేస్తున్న చిన్నారులు



సంక్రాంతి ముగ్గులో గొబ్బెమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతున్న విద్యార్థులు



ఎన్టీఆర్ స్టేడియంలో కోలాటం వేస్తున్న మహిళలు



గుడ్లవల్లేరులో భోగి మంటల చుట్టూ తిరుగుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అడ్డాడ(పామర్రు): గ్రామంలోని అరవింద హైస్కూల్లో గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఉల్లాసంగా... ఉత్సాహంగా సాగాయి. బొమ్మల కొలువు, చిన్న పిల్లలకు భోగిపళ్లు, భోగి మంటలు, గాలిపటాలు, ముగ్గుల పోటీలు అత్యంత వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు రంగవల్లుల పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల హెచ్ఎం ఎస్.రమణ మూర్తి బహుమతులు అందజేశారు. వచ్చే నెల ఫిబ్రవరి 2వ తేదీన పాఠశాలలో జరిగే వసంత పంచమి వాల్‌పోస్టర్‌ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య హెచ్ఎం ఆవిష్కరించారు.

గుడ్లవల్లేరు: తెలుగు సంప్రదాయం ఉట్టి పడేలా....చిన్నారులు ముద్దు ముద్దుగా చేసిన వివిధ కార్యక్రమాలు సంక్రాంతి ముందే వచ్చిందా? అన్నట్లుగా ఆ పరిసరాలు మారాయి. గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల అధినేత శింగంశెట్టి ఆదినారాయణ గురువారం బాల బాలికలకు చేపట్టిన సంక్రాంతి సంబరాల కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన రంగవల్లులు, డూడూ బసవన్నలు, భోగి పండ్లను పోయటం హరిదాసుల సంకీర్తలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఏఎన్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో గురువారం విద్యార్థులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. రంగవల్లులు, డూడూ బసవన్నలు, భోగీ పండ్లను పోయుట, హరిదాసుల సంకీర్తలు అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుడివాడ పట్టణంలో ఘనంగా....

గుడివాడ టౌన్: పట్టణంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో రెండు రోజుల సంక్రాంతి సంబరాలు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళలు కోలాటం, రంగవల్లులు, చిన్నారుల నృత్యం, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, వంటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం సంయుక్త కార్యదర్శి కె. రంగప్రసాదు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు వల్లూరుపల్లి లక్ష్మి, కోశాధికారి కె. ఝాన్సీలక్ష్మి, కరస్పాండెంట్ పి.వి. రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు వైఎస్. రామారావు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

విశ్వభారతిలో సంక్రాంతి సంబరాలు

గుడివాడ టౌన్: విశ్వభారతి వైజ్‌వుడ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మన్నెం పద్మావతి విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంప్రదాయబద్ధంగా విచిత్ర వేషధారణలు, గొబ్బెమ్మలు, భోగి మంటలు, భోగి పండ్లు, హరిదాసులు, కోలాటం, జానపద, సాంఘిక, ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైజ్‌వుడ్స్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, ఎండీలు ఆర్. మంజుల, ఆర్. ప్రణీత్, ప్రిన్సిపాల్స్, డీన్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్



తోట్లవల్లూరు: ఇసుక క్వారీ వద్ద బుధవారం జరిగిన కార్మికుల ఆందోళనకు సంబంధించి 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం. అర్జునరాజు తెలిపారు. క్వారీ నుంచి సరైన పత్రాలు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామని పేర్కొన్నారు. అలాగే లారీని తీసుకొచ్చే క్రమంలో విధులకు ఆటంకం కలిగించిన 20 కార్మికులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి



ముదినేపల్లి రూరల్: పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గురజ రోడ్డులో పార్టీ నేతలు గురువారం ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శేషపు మహంకాళిరావు ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి నేతలు నేడు దానిని విస్మరించి ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై భారం వేయడం తగదన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఈ స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలు వ్యతిరేకించాలని చెప్పిన కూటమి పార్టీల నేతలు మాట తప్పి అదే విధానాలను అమలు చేయడం దారుణమన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను ప్రజలు వ్యతిరేకిస్తూ విద్యుత్ బిల్లులను బోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిన్నం మాధవ, జక్కుల మహేష్, మోహనరావు, పాల్గొన్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

గుడివాడ టౌన్: ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం, హైందవుల ఆరాధ్యదైవం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో మృత్యుఘోషకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో భక్తులు తోపులాటలో ఏడుగురు మృతి చెందడం ప్రభుత్వ వైఫల్యం అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ దేవాదాయ శాఖ మంత్రి, హోం మంత్రి, టీటీడీ చైర్మన్ తక్షణమే రాజీనామా చేయాలని కోరారు. బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను వెంటనే అక్కడి నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.కోటి, దేవస్థానం రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి సైతం మెరుగైన వైద్యం అందించి పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుడ్డు చిన్నా, టి.వి. రమణకుమార్, కె. ఆంజనేయ ప్రసాదు, తులిమిల్లి యెషయ్య, షేక్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది వేడుకలకు తాడంకి హైస్కూల్ సిద్ధం



తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



నేతల విగ్రహాల పక్కన వందేళ్ల స్థూపం

పమిడిముక్కల: ఈ నెల 12న జరిగే శతాబ్ది వేడుకలకు తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిద్ధమవుతుంది. శతాబ్ది వేడుకల ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. వందేళ్ల వేడుకలు గుర్తుండేలా పాఠశాల మధ్యలో జాతీయ నాయకుల విగ్రహాల పక్కనే వందేళ్ల స్థూపాన్ని ఏర్పాటు చేశారు. పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. క్రీడా మైదానాన్ని సిద్ధం చేసి భారీ వేదిక ఏర్పాటు చేశారు. 11వ తేదీన వేడుకలకు అంకురార్పణ జరుగుతుంది. 12న శతాబ్ది వేడుకలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ఐదు వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొంటారని ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జక్కా శ్రీనివాసరావు, యేనుగ మస్తాన్‌రావు తెలిపారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వేడుకలకు హాజరవుతున్నారని చెప్పారు. జిల్లాలోని మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు.

సాంప్రదాయ క్రీడలే ముద్దు

కైకలూరు: సంక్రాంతి పండగ సమయంలో యువత కోడి పందేలు, పేకాట వంటి జూదాలకు ఆకర్షితులు కాకుండా సాంప్రదాయ క్రీడలైన కబడ్డీ, కో–కో, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ వంటివి ఆడుకోవాలని టౌన్ ఎస్సై ఆర్.శ్రీను సూచించారు. కై కలూరు మండలం రాచపట్నం, గోపవరం గ్రామాల్లో ప్రజలకు జూదాల వలన కలిగే నష్టాలను గురువారం వివరించారు. జూదాలకు వెళ్లకుండా గ్రామ పెద్దలు కట్టడి చేయాలని కోరారు.

ఆర్ఎంపీ క్లినిక్‌లో వైద్యాధికారుల తనిఖీ

కై కలూరు: స్థానిక సంతమార్కెట్ వద్ద ఆర్ఎంపీ నానీ క్లినిక్, పక్కనే కార్తికేయ మెడికల్, జనరల్ స్టోర్‌పై సోషల్ మీడియాలో వచ్చిన వీడియోపై జిల్లా వైద్య అధికారులు గురువారం తనిఖీ చేశారు. జిల్లా ఎక్స్‌టెన్సన్ మీడియా ఆఫీసర్ (డీఈఎంవో) నాగరత్నంతో పాటు విచారణ అధికారిగా శీతనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కె.అన్నపూర్ణ తనిఖీలు చేశారు. అర్హత ధ్రువపత్రాలను పరిశీలించారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఖాన్

కనుమూరు(పామర్రు): విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, చదువుకు దగ్గరగా ఉండాలని కనుమూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఖాన్ తెలిపారు. కనుమూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో కిశోర వికాశం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లు అధికంగా వాడితే విద్యార్థుల్లో మెదడు సక్రమంగా పని చేయదని తెలిపారు. బాల్య వివాహాల వలన కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు పలు చట్టాలు ఉన్నాయని వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనలను ఉపాధ్యాయులు గ్రహించి వాటిని సత్వరమే నిర్మూలించాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి మాట్లాడుతూ యవ్వన దశ పట్ల అవగాహన లోపంతో ఆకర్షణ ద్వారా ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పోషకాహారం, శారీరక శుభ్రతతో పాటు యోగా ప్రతి రోజూచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం శారద కాంత, హెల్త్ అసిస్టెంట్ సూర్యకళ, ఏఎన్ఎం పద్మ, అంగన్‌వాడీ ఇన్‌స్ట్రక్టర్లు పుష్పావతి, ప్రసన్న పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారికి ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివార్లకు తొలుత విశేషాభిషేకాలు చేపట్టారు. అలాగే గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయంలో స్వామివారికి మహిళా భక్తులు ముత్యాల హారతులు పట్టారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

ముమ్మర ఏర్పాట్లు...

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ముఖ ద్వార దర్శనానికి మండలంలోని వైష్ణవాలయాల్లో గురువారం ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుడ్లవల్లేరు వేణుగోపాల స్వామివారి ఆలయం, సత్యదేవుని ఆలయం, డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వరాలయం, విన్నకోట శ్రీ జనార్ధన స్వామివారి ఆలయం, కౌతవరం చెన్నకేశవాలయాల్లో ఆదివారం వేకువజామునే స్వామివారు దర్శనమిచ్చేందుకు గరుడ వాహనాలను ఎక్కడికక్కడ సిద్ధం చేస్తున్నారు.

వ్యక్తిగత బ్రాండింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రసంగిస్తున్న డాక్టర్ మధులత

గుడివాడ టౌన్: డిజిటల్ యుగంలో వ్యక్తగత బ్రాండింగ్ ప్రాముఖ్యతను తెచ్చిపెడుతుందని కేఎల్ బిజినెస్ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. మధులత అన్నారు. గురువారం స్థానిక ఏఎన్నార్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బ్రాండ్ మేనేజ్‌మెంట్‌కు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు బ్రాండ్ నిర్వచనం, దానిపై సామాజిక మాధ్యమాల ప్రభావం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, డాక్టర్ ఎంబీ సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్‌కు ఫణి రాజమోహన్



తోట్లవల్లూరు: మండల కేంద్రంలోని హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయుడు టి. ఫణి రాజమోహన్ సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. ఈ నెల 7,8 తేదీల్లో పోరంకిలోని మురళీ రిస్టార్ట్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆయన ప్రదర్శించిన మేథమెటికల్ టీచింగ్ ఎయిడ్స్ సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు టీచర్స్ ఎగ్జిబిట్ విభాగంలో ఎంపికైంది. ప్రదర్శన తిలకించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామారావు ఫణి రాజమోహన్‌ను ప్రత్యేకంగా అభినందించటంతోపాటు ఆయన ప్రదర్శించిన దానిలోని క.సా.గు అనే అంశంను తయారు చేయించి అన్ని పాఠశాలలకు పంపే ఏర్పాట్లు చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ వారికి సూచించారు. ఈ నెల 20 నుంచి 25 వరకు పుదుచ్చేరిలో జరగనున్న సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికై న ఫణి రాజమోహన్‌ను డీఈఓ పీవీజే రామారావు, డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓ–1 వెంకటేశ్వరరావు, ఎంఈఓ–2 సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ వల్లూరు సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

